RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 122 | మే 30 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| Nizamabad | Vol: 03 | Vol: 122 | May 30 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ధాన్యం కుప్పలు పేరుక పోయాయి 2

# తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రులు**



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్రంలో అంచనాలను మించి ధాన్యం ఉత్పత్తి అయిందని, పండిన ప్రతి గింజనూ కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం సేకరిస్తున్న రాష్ట్రం తెలంగాణేనని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా అంగీకరించిందని ఆయన గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పోలిస్తే తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, వేగంగా కొనుగోళ్లు జరుపుతోందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా కంటే అదనంగా ధాన్యం సేకరిస్తూ, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా రూ.16,479 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 143 లక్షల టన్నుల ధాన్యం పండగా, ఇప్పటివరకు 73 లక్షల టన్నుల కొనుగోళ్లు పూర్తయ్యాయని, సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సుమారు రూ.11,050 కోట్లను నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేశామని వివరించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మంది సిబ్బంది శ్రమిస్తున్నారని, 20.86 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని మంత్రి వివరించారు. ధాన్య రవాణా కోసం 13 వేల వాహనాలు, నిరంతర ప్రక్రియ కోసం 2 వేల రైస్ మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. బీహార్, బెంగాల్ ప్రాంతాల నుంచి వచ్చే హమాలీల కొరత కొంత ఉన్నప్పటికీ, ఎక్కడా ఆటంకాలు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

➢ మిగతా 2వ పేజిలో..

## ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్ జనసంఘర్షణ**

జాతీయ ఎడిబుల్ ఆయిల్ మిషన్‌లో భాగంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సాగవుతున్న మొత్తం ఆయిల్ పామ్ విస్తీర్ణంలో తెలంగాణ వాటా ఒక్కటే ఏకంగా 36 శాతంగా నమోదై రికార్డు సృష్టించిందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఒక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, 2021 నుండి 2026 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 2.73 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటల సాగు చేపట్టగా, అందులో కేవలం తెలంగాణలోనే గరిష్టంగా 98,112 హెక్టార్లలో సాగు జరిగి అగ్రస్థానాన్ని దక్కించుకుందని గణాంకాలతో సహా వివరించారు. తెలంగాణ రైతాంగం కనబరిచిన అపారమైన శ్రద్ధ, నిరంతర కృషి వల్లే ఈ అద్భుతమైన మైలురాయిని అందుకోగలిగామని ఆయన కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు సజావుగా సాగుతోందని, సుమారు

➢ మిగతా 2వ పేజిలో..

## నీట్ లీకేజీ దోషులపై కఠిన చర్యలు తప్పవు

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

నీట్ యూజీ పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, ప్రశ్నపత్రం లీకైన మాట వాస్తవమేనని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధికారికంగా అంగీకరించారు. ఒక జాతీయ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడంలో నేషనల్ టేస్టింగ ఏజెన్సీ విఫలమైందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధ్యులందరిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

➢ మిగతా 2వ పేజిలో..

# నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచన**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూూ)లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇన్ని పర్యవేక్షణా యంత్రాంగాలు, ఉన్నత స్థాయి కమిటీలు అందుబాటులో ఉన్నప్పటికీ ఇంత పెద్ద భద్రతా ఉల్లంఘన ఎలా జరిగిందని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇలాంటి సంఘటనలు పరీక్షలు రాసే లక్షలాది మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను, నిరాశను మిగులుస్తాయని న్యాయస్థానం అభిప్రాయపడింది. కేవలం సంస్కరణలు చేపడితే సరిపోదని, వ్యవస్థలో తప్పు జరిగినప్పుడు దానికి బాధ్యత ఎవరిదనే విషయంపై స్పష్టత ఉండాలని, జవాబుదారీతనాన్ని నిర్దేశించనంత వరకు అసలు సమస్య సర్దుమణగదని కోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఖూూజ) నిర్వహణ తీరును ప్రస్తావించిన న్యాయస్థానం, అక్కడ ఇలాంటి లీకేజీ ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని, యూపీఎస్‌సీని చూసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్నో విషయాలు నేర్చుకోవాలని హితవు పలికింది.

➢ మిగతా 2వ పేజిలో..

## పుణె జిల్లాలో కల్తీ మద్యం కలకలం

**11 మంది దుర్మరణం, పలువురి పరిస్థితి విషమం**

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో కల్తీ మద్యం మహమ్మారి మరోసారి పడగ విప్పింది. పుణె, పింప్రి-చింఛ్వాడ్ జంట నగరాల పరిధిలో కల్తీ మద్యం సేవించి ఇప్పటివరకు 11 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు ధృవీకరించాయి. స్థానికంగా లభించే మద్యాన్ని సేవించిన కొద్దిసేపటికే బాధితులు ఒక్కసారిగా వాంతులు చేసుకోవడం, కంటిచూపు మందగించడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడటం వంటి లక్షణాలతో కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో

➢ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

**93.60 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత**

**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరదించుతూ ఈసెట్ (టూ జుజజు) ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి ఈ ఫలితాలను ఆవిష్కరించారు. ఈ ఏడాది పరీక్ష రాసిన వారిలో రికార్డు స్థాయిలో 93.60 శాతం మంది అంటే మొత్తం 16,726 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలతో పాటు విద్యార్థుల మార్కులు, ఫైనల్ ర్యాంక్ వివరాలను కూడా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. డిప్లొమా (పాలిటెక్నిక్), బీఎస్సీ (మ్యాథమెటిక్స్) పూర్తి చేసిన అభ్యర్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు మే 15న రాష్ట్రవ్యాప్తంగా

➢ మిగతా 2వ పేజిలో..

# తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**మొదటిపేజీ తరువాయి..** చేశామని పేర్కొన్నారు. ఇటీవలి అకాల వర్షాల వల్ల తడిసిన 10,214 టన్నుల ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి తెలిపారు. ధాన్యం సేకరణపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం మద్దతు ధర కోసం కేవలం రూ.10 వేల కోట్లు ఇస్తే, తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా రూ.49 వేల కోట్లు కేటాయించిందని పోల్చి చెప్పారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 24 లక్షల టన్నులు కొంటే, తెలంగాణలో ఇప్పటికే 60 లక్షల టన్నులకు పైగా కొనుగోలు చేశామని గుర్తుచేశారు. యాసంగిలో రాష్ట్రం ఇంత పెద్ద ఎత్తున సేకరిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 5 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొంటామని చెప్పడం సమంజసం కాదన్నారు. బీజేపీ నేతలు రాష్ట్రంలో ధర్నాలు చేయడం మాని, ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కోటా పెంచేలా చూడాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ సేకరించేంత వరకు ఈ కేంద్రాలు పనిచేస్తూనే ఉంటాయని రైతులకు మంత్రులు గట్టి భరోసా ఇచ్చారు.

## ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్

**మొదటిపేజీ తరువాయి..** 79,448 మంది రైతులు ఈ పంట సాగుపై ఆధారపడి జీవిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ పంట ద్వారా రైతులకు ఎకరాకు సుమారు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల వరకు వార్షిక నికర ఆదాయం లభించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోందని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు (ఫీఫీదీ) ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.23,501 గిట్టుబాటు ధర పలుకుతోందని, కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలను పెంచే అవకాశం ఉన్నందున ఈ ధర భవిష్యత్తులో రూ.25,000 వరకు పెరిగే ఛాన్స్ ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ కోసం ఇప్పటికే 3 మిల్లులు విజయవంతంగా నడుస్తున్నాయని, వీటికి అదనంగా మరో 7 మిల్లులు ప్రస్తుతం వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో 85 వేల ఎకరాల్లో ఈ పంటను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

**జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి**

**31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి**

**కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు**

**హైదరాబాద్, మే29 :** రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

**పాపెసర్ నాగేశ్వర రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు**

**మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం**

**జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**

**హైదరాబాద్, మే29 :** తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు.

# నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి..** ఈ విచారణ సందర్భంగా నీట్ వ్యవస్థ ప్రక్షాళన కోసం కేంద్రం నియమించిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డాక్టర్ రాధాకృష్ణన్ కూడా కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఎన్నో రక్షణ చర్యలు ఉన్నప్పటికీ పేపర్ ఎలా లీకైందని న్యాయమూర్తి జస్టిస్ నరసింహ ప్రశ్నించగా, ప్రశ్నపత్రం రూపకల్పన (పేపర్ సెట్టింగ్) ప్రక్రియలోనే లోపం ఉందని డాక్టర్ రాధాకృష్ణన్ అంగీకరించారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను బలోపేతం చేశామని, పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు తాము మొత్తం 101 సూచనలు చేయగా, అందులో 60 తాత్కాలిక మార్గదర్శకాలను ప్రస్తుత పరీక్షల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని కోర్టుకు వివరించారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, యువత ఆందోళనలను ప్రభుత్వం ఎంతో తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ వ్యవహారాన్ని ప్రధానమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని ధర్మాసనానికి తెలిపారు. జూన్ 21న జరగబోయే నీట్-యూజీ పరీక్ష కోసం సర్వసన్నద్ధంగా సరికొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్‌టీఏ, డాక్టర్ రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్లను పరిశీలించిన సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌ను సమర్పించడానికి అదనపు గడువు ఇస్తూ తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

# నీట్ లీకేజీ దోషులపై కఠిన చర్యలు తప్పవు

**మొదటిపేజీ తరువాయి..** విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న విద్యా మాఫియా నెట్‌వర్క్‌లను పూర్తిగా అణచివేయడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ఈ కేసులన్నింటినీ ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారించేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఇదే సందర్భంలో సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల వెల్లడిలో తలెత్తిన గందరగోళంపైన కూడా కేంద్ర మంత్రి స్పందించారు. సీబీఎస్‌ఈ మూల్యాంకన ప్రక్రియలో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని ఒప్పుకున్న ఆయన, ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో వాటిని సరిచేస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా, సీబీఎస్‌ఈకి చెందిన పేమెంట్ గేట్‌వేపై విదేశీ హ్యాకర్లు సైబర్ దాడికి పాల్పడ్డారని మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సైబర్ దాడి సమస్యను పరిష్కరించి, భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సీబీఐ సైబర్ బృందం రంగంలోకి దిగి సీబీఎస్‌ఈకి సహకరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇప్పటికే 11 లక్షలకు పైగా విద్యార్థులు తమ జవాబు పత్రాల కాపీలను పొందగా, మరో నాలుగు లక్షల మందికి పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని మంత్రి వివరించారు. ఫలితాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును కూలంకషంగా పరిశీలించి పరిష్కరిస్తామని, భవిష్యత్తులో ఇలాంటి లోపాలు పునరావృతం కాకుండా విద్యా వ్యవస్థలో అవసరమైన అన్ని రకాల సంస్కరణలు మరియు దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## చర్లపల్లి జైలుకు బండి భగీరథ్ తరలింపు

**హైదరాబాద్, మే29 :** పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. 3 రోజుల పోలీస్ కస్టడీ గడువు ముగియడంతో విచారణ తర్వాత మల్కాజిగిరి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

## ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

**ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు**

**హైదరాబాద్, మే29 :** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు.రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు.ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# పుణె జిల్లాలో కల్తీ మద్యం కలకలం

**మొదటిపేజీ తరువాయి..** 11 మంది చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మరికొందరి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉందని, దీనివల్ల మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదంఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఈ విషాద ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అత్యంత వేగంగా స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టవద్దని, కల్తీ మద్యం తయారీ మరియు విక్రయాల వెనుక ఉన్న విక్రేతలను తక్షణమే గుర్తించి అరెస్ట్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రుల్లో ఉన్న బాధితులందరికీ అత్యుత్తమ మరియు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికార యంత్రాంగానికి స్పష్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి, ఈ కల్తీ మద్యం సరఫరాలో కీలక పాత్ర పోషించిన ఇద్దరు వ్యక్తులను ఇప్పటికే అధికారికంగా అరెస్ట్ చేసినట్లు పింప్రి ఏసీపీ సచిన్ హిరే వెల్లడించారు.

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి..** ఈ పరీక్షను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంతో పాటు ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను చాలా త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించారు. జూలై మొదటి వారం నుంచే కొత్త విద్యా సంవత్సరపు క్లాసులు ప్రారంభం అవుతాయని, కాలేజీల ఫీజుల వివరాలు గత ఏడాది మాదిరిగానే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌లో తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ మరియు రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటిస్తామని వెల్లడించారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా పూర్తయ్యే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను భద్రపరుచుకోవాలని, కౌన్సెలింగ్‌కు సంబంధించిన తాజా సమాచారం (అప్‌డేట్స్) కోసం అభ్యర్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

## ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు లేవు

**80శాతం ధాన్యం కుప్పల పేరుకున్నాయి**

**బిజెపి భరోసా యాత్రలో అసలు విషయాలు గమనించాం**

**సింఎం రేవంత్‌కు అధికారులప పట్టు లేదన్న ఏలేటి**

**హైదరాబాద్, మే29 :** రాష్ట్రంలో రైతాంగం పడుతున్న బాధలు తెలుసుకునేందుకు 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్ర చేపట్టామని అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నాలుగు రోజుల పాటు అనేక జిల్లాల్లో పర్యటించి.. రైతాంగం ఆర్తనాదాలు విన్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తి అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. కానీ తాము చేసిన ఈ యాత్రలో 80 శాతం ధాన్యం కుప్పలు పేరుకుపోయి కనిపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పోరాటం చేయగానే.. ప్రభుత్వం సమీక్షలు, జిల్లాల్లో కల్లాల బాట పడుతుందని ఆరోపించారు. ఇవే సమీక్షలు, పర్యటనలు మంత్రులు ముందే చేస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్మినిస్ట్రేషన్‌పై కంట్రోల్ లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో దోపిడి రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రైతుల వద్ద ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయలేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయలేదా? అని రేవంత్ సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక, సిమెంట్ లారీలను ముందే ఆపి ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులే గన్నీ బ్యాగులు కొనే పరిస్థితి లేదన్నారు. లారీ, హమాలీల ఖర్చు రైతులే చెల్లిస్తున్నారని తద్వారా రైతాంగం శ్రమను ఈ విధంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. చివరి గింజ వరకు కొనే బాధ్యత నాదని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేతకాకపోతే ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోమ్మని గత సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సందేహం వ్యక్తం చేశారు. గద్దెనెక్కగానే రేవంత్ రెడ్డి గద్దలా మారిపోయారంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై నిప్పులు

# హామీలు నెరవేర్చాలి: గ్రామ సంస్థ సహాయకుల 12 రోజుల సమ్మె

❑ **ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం**

ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)

గ్రామ సంస్థ సహాయకులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం గత 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వాంకుడోతు మోతిలాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇల్లందు మండల రెవెన్యూ కార్యాలయం ముందు జరుగుతున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం గ్రామ సంస్థ సహాయకులకు నెలకు రూ. 26,000 వేతనం చెల్లించాలని, వారిని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని నాయకులు కోరారు. వీటితో పాటు గృహ అద్దె భత్యం, పని కోసం మడత కంప్యూటర్లు (ల్యాప్‌టాప్‌లు) అందించాలని, సమన్వయకర్తలుగా పదోన్నతులు కల్పించాలని, జీవో సంఖ్య 58 అమలు చేయడంతో పాటు రూ. 20 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ సంస్థ సహాయకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో వారి ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తూ పెద్ద ఎత్తున పోరాటంలో పాల్గొంటామని మోతిలాల్ హెచ్చరించారు.



సమస్యలు తీరే వరకు సహాయకులంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకుడు యాదగిరితో పాటు గ్రామ సంస్థ సహాయకుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు కొక్క, పృథ్వీ, రవి, సునీల్, రాంబాబు, గీత తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

❑ **హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి దిండిగాల రాజేందర్ డిమాండ్**

ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలో ఐకేపీ, సెర్ఫ్ అనుబంధ వీఓఏ (గ్రామ సంస్థ సహాయకులు) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 12 రోజులుగా నిరవధిక సమ్మె, నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇల్లందులోని వారి దీక్షా శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు సందర్శించి, వీఓఏల పోరాటానికి తమ పూర్తి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు వీఓఏల వేతనాలను తక్షణమే పెంచాలని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ఇచ్చిన జీవో 58ను సవరించాలని, అర్హత కలిగిన వీఓఏలను కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా (జజం) నియమించాలనే డిమాండ్లకు ఆయన మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని, వీఓఏల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను, ఉద్యోగులను నిరాశపరిచిందని దిండిగాల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు. వీఓఏలు చేస్తున్న న్యాయమైన పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వీఓఏ జేఏసీ నాయకురాలు నవ్య మాట్లాడుతూ.. తాము ఎదుర్కొంటున్న సమస్యలను, ఈ సమ్మె చేపట్టడానికి గల ప్రధాన కారణాలను బీఆర్ఎస్ నాయకులకు కూలంకషంగా వివరించారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు తీర్చే వరకు వెనకడుగు వేసేది లేదని ఆమె స్పష్టం చేశారు.





ఈ సంఘీభావ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబ్దుల్ నబీ, వసంతరావు, రవి గౌడ్, శీను, రాజేష్, ఉపేందర్ రావు, లలిత్ కుమార్, సునీల్ కుమార్, శ్రీకాంత్, శివ, శ్రీనివాస్, అమీర్, సర్దార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీఓఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇల్లందులో చీరల పంపిణీ.. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్త్‌డే వేడుకలు

❑ **మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశాలతో, కౌన్సిలర్ రంప రమ్య ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొడ్డా కిరణ్ మిత్ర హాజరై మహిళలకు స్వయంగా చీరలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మహిళలకు నిజమైన అభివృద్ధి జరుగుతోందని, మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొడ్డా కిరణ్



మిత్ర పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక కౌన్సిలర్ రమ్య, కమిటీ సభ్యులు మహిళలు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఛైర్‌పర్సన్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ తనకు శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్‌కు, మహిళలకు, కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారం, ఛైర్‌పర్సన్ సూచనలతో వార్డులోని ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలను చేరవేస్తామని కౌన్సిలర్ రంప రమ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సాయి తేజ, ఆర్పీ హైమావతి, పట్టణ మాజీ అధ్యక్షులు దొడ్డ డేనియల్, 12వ వార్డు కమిటీ సభ్యులు జాన్సన్, పెద్దినేని హరినాథ్ బాబు, రాకేష్, పండు, బాల ప్రసాద్, బన్నీ, కోపెల్లి రవి, శ్రీనివాస్, వార్డు ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వివో ఏలకు బి.ఆర్.ఎస్ మద్దతు




కోటగిరి/మే/29/(జన సంఘర్షణ)

కోటగిరి మండల కేంద్రంలో దీక్షలు చేపడుతున్న ఐకెపి వివో ఏ లకు బి.ఆర్.ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బి ఆర్ ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్షల్లో కూర్చోవడం జరిగింది వివో ఏళ్లతో సమస్యలపై చర్చించడం జరిగింది. గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే సీతక్క వివోఏలకు కనీసం 28 వేల రూపాయల నెలసరి వేతనం ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి అని హెచ్ఆర్ పాలసీ వర్తింపచేయాలి అని బీమా సౌకర్యం కల్పించాలి అని అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి అని అసెంబ్లీలో డిమాండ్ చేయడం జరిగింది. నేడు అదే శాఖకు మంత్రిగా కొనసాగుతున్న సీతక్క తక్షణమే ఐకెపి వివో ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి అని బి ఆర్ ఎస్ కోటగిరి మండల నాయకులు తెల్ల రవికుమార్ డిమాండ్ చేశారు . అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు తక్షణమే వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు రాబోయే రోజులలో ప్రభుత్వ ఉద్యోగులంతా రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉద్యోగులకు యువకులకు మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇవ్వడం జరిగింది అని మండిపడ్డారు. తక్షణమే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి అని డిమాండ్ చేశారు. వివిఏఓలతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలి అని లేనట్లయితే వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, సమీర్, నజీర్, కప్ప సంతోష్, శంకర్ గౌడ్, బేగారి మారుతి, ఉమాకాంత్, యోగేష్, దత్తు, మసూద్, వజాద్, రహీం, మేత్రి, గంగాధర్ శివ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివో ఎల ఉద్యోగ సంఘం నాయకులు మండలంలోని వివిధ గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో మానవత్వం చాటుకున్న వస్త్ర వ్యాపారి: బాధితురాలికి వీల్ చైర్ వితరణ

భద్రాచలం మే 29 (జన సంఘర్షణ)



భద్రాచలం పట్టణానికి చెందిన పిలక ధనలక్ష్మి అనే మహిళకు షుగర్ వ్యాధి కారణంగా కుడికాలు మోకాలు కింది భాగం వరకు తొలగించారు. ప్రస్తుతం ఆమె వాడుతున్న వీల్ చైర్ పాతది కావడంతో నిత్యం తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ప్రముఖ వస్త్ర వ్యాపారి నీలి దేవి ప్రసాద్ మానవతా దృక్పథంతో స్పందించి, ఆమెకు ఒక కొత్త వీల్ చైర్‌ను విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ వీల్ చైర్‌ను శుక్రవారం భద్రాచల సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం అధికారుల ద్వారా ధనలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. నీలి దేవి ప్రసాద్ స్నేహితులైన సాయిబాబా ఆలయ కమిటీ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సమాజ సేవకుడు కడాలి నాగరాజుల ఆధ్వర్యంలో.. దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్, సూపరింటెండెంట్లు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా చేతుల మీదుగా ఈ వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పిలకా రాము తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు పంచాయతీ కార్యదర్శుల సన్మాన వేడుక

పోతంగల్:/మే 29/(జన సంఘర్షణ)



పోతంగల్ మండలం కల్లూరు గ్రామ పంచాయతీలో బదిలీపై వెళ్తున్న సెక్రటరీ ప్రతాప్, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సెక్రటరీ రాజులకు ఘనంగా సన్మానం జరిగింది. కల్లూరు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రతాప్ అందించిన సేవలను అభినందిస్తూ.. నూతన సెక్రటరీ రాజుకు సర్పంచ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో గ్రామ ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోధన్: నిజాం షుగర్ పోరాట నేతలకు ఊరట..

❑ **కేసు కొట్టివేత**

బోధన్/మే 29/(జనసంఘర్షణ)



బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ కోసం 2018లో జరిగిన ఉద్యమాల సందర్భంలో నమోదైన కేసును బోధన్ కోర్టు ఈరోజు కేస్ కొట్టి వేసింది . బీర్పూర్ శంకర్, బి మల్లేష్, పుట్టపర్వయ్య, వి రాఘవులు, గుమ్ముల గంగాధర్, జై శంకర్, ఏషాల, గంగాధర్, ఎస్ సాయిలు, రాములు, యాదవ్ ,గోపి, తదితరులపై కేసు నమోదైన కేసులో పోలీసులు సాక్షులు చూపలేకపోవడంతో కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ విజయం రైతులు కార్మికులు బోధన్ ప్రజలందరికీ నాయకులు తెలిపారు.

# కామారెడ్డి స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మృతి

మెదక్/మే/29/(జన సంఘర్షణ)



మెదక్ జిల్లా వెలుదపర్తి మండల్‌లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కామారెడ్డికి చెందిన చింతకింద శ్రీనివాస్ వయసు (43) నరసన్నపల్లి శివారులోని సిమ్మింగ్ ఫుల్ మునిగి మృతి చెందాడు. గురువారం సాయంత్రం తన కుమారుడితో కలిసి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లిన ఆయన ఈత కొడుతూ నీటిలో మునిగిపోయాడు. ఈ ఘటన పై ఆయన భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# భద్రాచలంలో యువతి అదృశ్యం: పోలీసుల విచారణ ముమ్మరం

భద్రాచలం మే 29 (జన సంఘర్షణ)



భద్రాచలం పట్టణానికి చెందిన మద్దెటి అనూష (20) అనే యువతి అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఖమ్మంలోని మమత రోడ్ ప్రాంతంలో గల ఒక బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న అనూష, ఇటీవలే భద్రాచలంలోని తన స్వగ్రామానికి వచ్చి తల్లి వద్ద కొన్ని రోజులు గడిపింది. ఈ క్రమంలో మే 20న తిరిగి ఖమ్మంకు బయలుదేరి వెళ్ళిన ఆమె, అప్పటి నుండి కుటుంబ సభ్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో ఆందోళన చెందిన తల్లి మద్దెటి లలిత పోలీసులను ఆశ్రయించారు. మొదట ఖమ్మం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కోసం కేసును భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం ఎస్ఐ జి. స్వప్న కేసు నమోదు చేసి, విచారణ ముమ్మరం చేశారు. అనూష ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వెంటనే భద్రాచలం పోలీస్ స్టేషన్‌ను గానీ, లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
శనివారం 30 మే 2026

# ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ జన్మదిన వేడుకలు

- ఘనంగా నిర్వహించిన వెంకట్ డాన్స్ అకాడమీ

**ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)**

ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రతినిధులు ఆమెకు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా వెంకట్ డాన్స్ అకాడమీ సభ్యులు, మాస్టర్స్ సమక్షంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చేత కేక్ కట్ చేయించారు. అనంతరం ఆమెను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అకాడమీ తరపున ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇల్లందు పట్టణ సమగ్ర అభివృద్ధికి, ప్రజాసేవకు దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.
అలాగే, చైర్‌పర్సన్‌కి భగవంతుడు నిండు ఆయురారోగ్యాలను, సుఖశాంతులను ప్రసాదించాలని అకాడమీ సభ్యులు కోరుకున్నారు. ప్రజలకు ఆమె మరిన్ని సేవలందించేలా ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు అందజేశారు.ఈ ఘనమైన జన్మదిన



వేడుకల కార్యక్రమంలో వెంకట్ డాన్స్ అకాడమీ ముఖ్య నిర్వాహకులు, డాన్స్ మాస్టర్స్ కడారి వెంకటేష్, సాయి మాస్టర్ లతో పాటు పలువురు కళాకారులు, డాన్స్ అకాడమీ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నారాయణపురంలో తాగునీటి కష్టాలు.. మంచినీళ్లకై కాలనీవాసుల పోరు

- రూ. 42 లక్షల పైపులైన్ పనులు పూర్తి చేసి సమస్య తీర్చాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

**అశ్వారావుపేట మే 29 (జన సంఘర్షణ)**

అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత వారం రోజులుగా అస్సలు నీళ్లు రాకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలు ఈ గ్రామంలో మంచినీళ్ల కోసం ప్రజలు గత 11 ఏళ్లుగా పోరాటం సాగిస్తూనే ఉండటం గమనార్హం. గతంలో మంచినీటి సమస్యపై గ్రామస్థులు పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ నిరసనల ఫలితంగా అప్పటి ప్రభుత్వంలో ఉన్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) దృష్టికి ఈ సమస్య వెళ్ళింది. దాంతో రాష్ట్రస్థాయి అధికారులు నారాయణపురం గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. అధికారుల పరిశీలన అనంతరం, వినాయకపురం నుండి నారాయణపురం గ్రామానికి పైపులైన్ ద్వారా



మంచినీటిని సరఫరా చేయడానికి అప్పటి ప్రభుత్వం దాదాపు రూ. 42 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ పైపులైన్ పనులు పూర్తయితే నారాయణపురం పంచాయతీ పరిధిలోని సుమారు 6 గ్రామాలకు తాగునీటితో పాటు నిత్యవసర పనులకు నీటి కొరత తీరుతుందని ప్రజలు ఎంతో సంతోషించారు. అయితే అధికారుల అనుమతులు వచ్చినా, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మరియు ఆలస్యం కారణంగా పనులు సకాలంలో ప్రారంభం కాలేదు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ మంచినీటి సరఫరా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నారాయణపురం తాగునీటి ప్రాజెక్టు పనులు మూలనపడ్డాయి. గ్రామస్థులు నూతన ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు కూడా పలుమార్లు తమ మంచినీటి సమస్యను వివరించారు. గ్రామంలో కొత్తగా బోర్లు వేసినా నీళ్లు పడవని యువకులు, ప్రజలు మొరపెట్టుకున్నా వినకుండా అధికారులు బోర్లు వేశారు. కానీ ప్రజలు ఊహించినట్లుగానే ఆ బోర్లలో నీళ్లు పడకపోవడంతో సమస్య మొదటికే వచ్చింది. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి, రూ. 42 లక్షల పైపులైన్ పనులను పునఃప్రారంభించి ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ తాగునీటి కష్టాలను తీర్చాలని నారాయణపురం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబంపై అసత్య ప్రచారాలు..

- డీఎస్పీకి బోళ్ల సూర్యం ఫిర్యాదు
- ఆదివాసి ఎమ్మెల్యే కనకయ్యపై కుట్రపూరిత విమర్శలు ఆపకపోతే ఆందోళనలు: బోళ్ల సూర్యం హెచ్చరిక
- బీఆర్ఎస్ నేతలపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి: డీఎస్పీని డిమాండ్ చేసిన బోళ్ల సూర్యం
- ఎమ్మెల్యే కనకయ్యకు కాంగ్రెస్ అండ: డీఎస్పీని కలిసిన బోళ్ల సూర్యం ,20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్

**ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)**

ఎస్టీ ఆదివాసి వర్గానికి చెందిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వారి కుటుంబ సభ్యులపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇటీవల కాలంలో అత్యంత దారుణంగా అసత్య, నిరాధార, రాజకీయ దుష్ప్రచారాలు చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధమైన కుట్రపూరిత చర్యలను ఇల్లందు కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇల్లందు పోలీసు డీఎస్పీ వెంకన్న బాబును కలిసి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్ వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ ఆదివాసి వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధి అయిన ఎమ్మెల్యే కోరం కనకయ్య గౌరవాన్ని దెబ్బతీసేలా, వారి కుటుంబ సభ్యులపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కనకయ్యను సామాజికంగా, రాజకీయంగా అవమానించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సిలువేలు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్ పాషా, గిన్నారపు రాజేష్, సత్తాల హరీష్‌లతో పాటు మరికొందరిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం అధికారికంగా ఫిర్యాదు చేశారు. తప్పుడు ప్రచారాలకు ఒడిగడుతున్న సదరు బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఇతర కఠిన క్రిమినల్ చట్టాలతో కూడా వెంటనే కేసు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం పోలీసు అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం మాట్లాడుతూ.. ఒక గిరిజన ప్రజా ప్రతినిధి ఎదుగుదలను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు కుట్రపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం అత్యంత బాధాకరం తీవ్ర ఖండనీయమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు, ఆరోపణలు ఏ రూపంలో వచ్చినా కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేయడం బీఆర్ఎస్ నాయకుల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం మండిపడ్డారు. గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్న నాయకుడిపై ఇటువంటి దుష్ప్రచారాలు చేయడం వారి సంకుచిత




మనస్తత్వాన్ని చూపిస్తుందని ధ్వజమెత్తారు. ఇలాంటి హేయమైన చర్యలను బీఆర్ఎస్ నాయకులు వెంటనే ఆపకపోతే ఇల్లందు నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం తీవ్రంగా హెచ్చరించారు. గిరిజన సమాజాన్ని అవమానించే వారిపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం,20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్, పాల్గొని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# కూకట్‌పల్లిలో పెన్షన్ లబ్ధిదారుల "చేయూత" యాప్ నమోదు కార్యక్రమం

**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 29, (జన సంఘర్షణ):**


కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వ రూపొందించిన "చేయూత" యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు ఫోటోలు సేకరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసెర్చ్ పర్సన్ జానకి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు.



# మహబూబాబాద్ జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టు భర్తీ

- అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్ మే 29 (జన సంఘర్షణ)**



మహబూబాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి హైదరాబాద్‌లోని కమిషనర్, ఈఎస్డీ (మీ సేవ) ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేపట్టబడుతుందని, ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ. 32,000/- (ఆల్ ఇన్‌క్లూజివ్) చొప్పున వేతనం చెల్లించబడుతుందని పేర్కొన్నారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు 30.05.2026 నుండి 15.06.2026 సాయంత్రం 5:00 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తులను కేవలం అధికారిక వెబ్‌సైట్ అయిన https://meeseva.telangana.gov.in ద్వారా మాత్రమే స్వీకరిస్తారని, ఇతర మార్గాల్లో వచ్చే దరఖాస్తులను పరిగణించరని స్పష్టం చేశారు. నోటిఫికేషన్‌లో సూచించిన విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, సంబంధిత అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మెరిట్, సర్టిఫికేషన్లు మరియు ఇంటర్వ్యూలో సాధించిన ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని, అర్హత గల అభ్యర్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారి కోరారు.

# నందమూరి తారక రామారావు లెజెండరీ అవార్డ్స్ ప్రధానోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్.



**హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 29, (జన సంఘర్షణ):**

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు లెజెండరీ అవార్డ్స్ ప్రధానోత్సవం గురువారం ఫిలింనగర్ క్లబ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ రంగంలో విశేష ప్రతిభ చూపిన పలువురు పెద్దలకు ఎన్టీఆర్ లెగసి అవార్డులను బండి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి రమేష్ చిత్ర ప్రముఖులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అవార్డులు పొందిన వారిని కళామ్మాతల్లి ముద్దుబిడ్డలని రమేష్ అభినందించారు.

# 21వ వార్డులో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

- కౌన్సిలర్ నీలపు రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**ఇల్లందు మే 29 (జన సంఘర్షణ)**



ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శుక్రవారం అత్యంత ఘనంగా జరిగింది. స్థానిక వార్డు కౌన్సిలర్ నీలపు రమేష్ ఈ కార్యక్రమానికి ముఖ్యకర్తగా వ్యవహరించి, వార్డులోని మహిళలకు స్వయంగా చీరలను పంపిణీ చేశారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే వార్డులోని ప్రతి అర్హురాలైన మహిళకు ప్రభుత్వ సహాయం అందేలా చూస్తామని ఈ సందర్భంగా కౌన్సిలర్ నీలపు రమేష్ స్పష్టం చేశారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే కౌన్సిలర్ నీలపు రమేష్, మహిళల ఆర్థిక, సామాజిక సంక్షేమానికి తమ వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను కాలనీవాసులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తమ వార్డు కౌన్సిలర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొని చీరల పంపిణీ సజావుగా సాగేలా అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీరితో పాటు 21వ వార్డు ముఖ్య నాయకులు, కాలనీ పెద్దలు, పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, వార్డు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేశవ్యాప్తంగా ఒకే అత్యవసర నంబర్: సుప్రీంకోర్టు

**హైదరాబాద్/మే 29/(జన సంఘర్షణ)**




దేశవ్యాప్తంగా అత్యవసర సేవల కోసం ఒకే హెల్ప్ లైన్ నంబర్ 112'ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం వేర్వేరు అత్యవసర సేవలకు వేర్వేరు నంబర్లు ఉండటం వల్ల బాధితులు ఇబ్బంది పడుతున్నారని, ఇది గందరగోళానికి దారితీస్తోందని కోర్టు అభిప్రాయపడింది. రోడ్డు భద్రత సంస్థ 'సేవ్ లైఫ్ ఫౌండేషన్' దాఖలు చేసిన పిటిషన్పై విచారణ చేపట్టిన ధర్మాసనం, ట్రామా కేర్ అనేది జీవించే హక్కుతో ముడిపడి ఉందని స్పష్టం చేసింది.

## పిఏసి చైర్మన్ అరికేపూడి గాంధీ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- తెలిపిన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 29, (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరికేపూడి గాంధీ వివాహ వార్షికోత్సవం సందర్భంగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి,శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, కాశినాథ్ యాదవ్, అభి గౌడ్, వెంకటకృష్ణ, లలన్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే శాసనసభ ఎన్నికల్లో బారాస ఘన విజయం

- నాయకులు, కార్యకర్తలు ఎలాంటి నిరాశకు గురికాకూడదు
- రాబోయే కాలం మనదే..
- మద్నూర్ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హనుమాన్ షిండే




కామారెడ్డి /మే 29/ (జన సంఘర్షణ)

రానున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టి బారాసకు పట్టం ప్రజలు కడతారని జూకల్ బారాస మాజీ ఎమ్మెల్యే హనుమాన్ షిండే జోష్యం చెప్పారు. అధికారం చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గరగా మూడేళ్లు కావస్తున్న కామారెడ్డి లో ప్రకటించిన హామీలను ఇప్పటివరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదని హనుమాన్ షిండే కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ లో జరిగిన బారాస పార్టీ సభ్యత్వం నమోదు సన్న హక్ సమావేశంలో హనుమాన్ షిండే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలకు దిగారు. బారాస ప్రభుత్వంలోని చేపట్టిన పనులను ఇప్పటివరకు పూర్తి చేయలేదని మాజీ ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. మూడేళ్లు కావస్తున్న జూకల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చేసింది శూన్యమని హనుమాన్ షిండే తీవ్రంగా మండిపడ్డారు. ఆయనకు ఎవరైనా వ్యతిరేకంగా పనిచేస్తే పోలీసులు చేత బెదిరింపులకు పాల్పడుతున్నారని అలాంటి బెదిరింపులకు ఎవరు భయపడదని హనుమాన్ షిండే వెల్లడించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తెచ్చుకున్నాము అన్న బాధ ప్రజలు వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా హనుమాన్ సిండే గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన విమర్శించారు. పదేళ్లు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఒక ఆదర్శ రాష్ట్రంగ చేసిన విషయాన్ని హనుమాన్ షిండే గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న కామారెడ్డి లో రాహుల్ గాంధీ ప్రకటించిన 420 హామీలు ఇప్పటివరకు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హనుమాన్ షిండే ఆరోపించారు. మరో రెండేళ్లు గడిస్తే రానున్నది కేసీఆర్ పాలన అంటూ హనుమాన్ షిండే జోష్యం చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం హయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు శిలాఫలకాలు వేయడం చేతులు ఎత్తివేయడం జరుగుతుందని నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ ఆరోపించారు. నిధులు లేకున్నా శిలాఫలకాలు వేసి ప్రజల్ని మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ ఆరోపించారు. బారాస నుంచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేయమని బాధపడుతున్నారని ఈ సందర్భంగా బీగల గణేష్ గుర్తు చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారని మీ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీజీ గౌడ్ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒక భవనం కట్టలేదు గత వైకాపా ప్రభుత్వం

- సి ఆర్ సి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు మే 29 (జన సంఘర్షణ)



తెలుగుదేశం ప్రభుత్వం 2014-19 మధ్య ప్రారంభించి చాలా వరకు పనులు పూర్తి చేసిన భవనాన్ని గత వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విమర్శించారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 49వ వార్డు కోడిగుంటపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీఆర్సీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిని కాంక్షించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. తాజాగా ఉద్యానవన శాఖ ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లాకు రూ.300 కోట్లు నిధులు కేటాయించిందని.. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు ముందుకు సాగుతుందన్నారు. కోడిగుట్టపల్లి పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి వార్డులోనూ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల కోసం రూ.30-40 లక్షల వెచ్చించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే చిత్తూరులో అభివృద్ధి పనులు ఏ స్థాయిలో జరిగిందో అందరూ చూస్తున్నారని... గత కొన్ని దశాబ్దాలుగా జరిగని అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ మేయర్ అముద, నగర తెదేపా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చయప్ప, స్థానిక క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్చార్జులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కి తెలుగు మహిళలు కృతజ్ఞతలు

చిత్తూరు మే 29 (జన సంఘర్షణ)




రాష్ట్రమంతా 27-28 తేదీలలో జరిగిన మహానాడు సమావేశాలు అత్యంత వైభవంగా ముగిసాయి. దీంతోపాటు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం మహిళలకు అన్ని రంగాల్లో 33% రిజర్వేషన్ కల్పిస్తూ మహానాడులో తీర్మానించడంలో తెలుగుదేశం పార్టీకి మహిళలపై ఎంతో చిత్తశుద్ధి ఉందని తెలుపుతూ.. చిత్తూరు గాంధీ సర్కిల్ వద్ద శుక్రవారం ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు నియోజకవర్గ టిడిపి మహిళా మణులు పసుపు జెండాలతో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబుకి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మేయర్ ఆముద, చూడ చైర్మన్ కటారి హేమలత, రాష్ట్ర టిడిపి నాయకురాలు రాజేశ్వరి. మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు తిరుచ్చిపై పద్మావతి దేవి విహారం

తిరుచానూరు, మే 29 (జన సంఘర్షణ)



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై నాలుగు మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉద్యానవనంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఉంజల్ సేవ నిర్వహించారు.

## ప్రజా ఉద్యమాల ధ్రువతార, జక్కా వెంకయ్య వర్ధంతి

- సిపియం పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు

మనుబోలు, 29.5.2026 (జన సంఘర్షణ)



పేద ప్రజల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని ధారపోసిన సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ జక్కా వెంకయ్య ఎనిమిదవ వర్ధంతిని మనుబోలు పిడూరు ఆటో స్టాండు వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సామాజిక సేవలను, ప్రజా పోరాటాలను పలువురు గుర్తుచేసుకుని ఘనంగా నివాళులర్పించారు .సీపీఎం సీనియర్ నాయకులు మండల కార్యదర్శి తలారి దేవదానం(చెర్లోపల్లి ) మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన జక్కా వెంకయ్య , కమ్యూనిస్టు దిగ్గజం పుచ్చలపల్లి సుందరయ్య తో ఉన్న సాన్నిహిత్యంతో కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. సీపీఎం పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ, జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టి, పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. జిల్లాలో జరిగిన అనేక భూపోరాటాలు, కూలీ పోరాటాలలో జక్కా వెంకయ్య అలుపెరగని పోరాటం చేశారు. దామరమడుగులో జరిగిన చారిత్రాత్మక కూలీ పోరాటంలో అంకులయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయినా, పేదల హక్కుల కోసం ఆయన ముందుండి నడిపించారు.

## 14 లక్షల రూపాయలతో నూతన పైప్లైన్ కొరకు శంకుస్థాపన కార్యక్రమం

- నిర్వహించిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, మే 29, (జన సంఘర్షణ):



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరత్ నగర్ హెచ్.ఐ.జి వద్ద 14 లక్షల రూపాయలతో నూతన పైప్లైన్ కొరకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత నాది అని గతంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిదులు కొరత లేకుండా నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రతినిత్యం ఏదో ఒకచోట శంకుస్థాపన నిర్వహించేవారుమని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరాలైనా కూడా నియోజకవర్గానికి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం లేదని, అరకొర నిధులతో అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అఖండ మెజారిటీతో మూడుసార్లు గెలిపించిన ప్రజల రుణం ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సరే ఓర్చుకుని ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, బిక్షపతి, బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా పిరమల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ అల్విన్ కాలనీ బ్రాంచ్‌ను ప్రారంభించిన దొడ్ల రామకృష్ణ గౌడ్

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, మే 29, (జన సంఘర్షణ):




శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పిరమల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ అల్విన్ కాలనీ బ్రాంచ్ ను యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ముఖ్యఅతిధిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్ గౌడ్, సంతోష్ బిరాధర్, అభి గౌడ్, బ్రాంచ్ మేనేజర్ సౌమ్య, సిబ్బంది నాగశిరీష, రాజు, అనూష, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం వేయకండి

- పురపాలక సంఘం కమిషనర్ వి. శ్రీనివాసరావు.
- కుప్పం పురపాలక సంఘం పరిధిలో కొనసాగిన ఆపరేషన్ క్లీన్ స్వీప్.



**కుప్పం,మే 29 జనసంఘర్షణ:** ఇంటిని,ఇంటి పరిసరాలను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని కుప్పం పురపాలక సంఘం కమిషనర్ వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం కుప్పం పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మీపురంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మైక్ ద్వారా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, వీధుల్లోని మురుగునీటి కాలువలలో ఎవ్వరు చెత్తాచెదారం వేయవద్దని కోరారు. కాలువలలో చెత్తాచెదారం వేయడం వల్ల చెత్త పేరుకుపోయి దోమలకు నిలయంగా మారుతుందని తద్వారా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు పరిశుభ్ర కుప్పంకు ప్రజలందరూ తమ సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులు చెత్తాచెదారం తొలగింపు పనులను చేపట్టారు.

## మహానాడులో ముస్లిం మహిళ ప్రత్యేక ఆకర్షణ

- పండుగ రోజు కుటుంబం సహా మహానాడుకు హాజరు.
- మహిళ ఆశీర్వాదం అందుకున్న 11వ క్లస్టర్ ఇంచార్జి కే.కన్నన్.




**కుప్పం,మే 29 జనసంఘర్షణ:** కుప్పం పట్టణంలోని 11వ క్లస్టర్ పరిధిలోని కన్యకా పరమేశ్వరి సత్రంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ముస్లిం మహిళ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బక్రీదు పండుగ సందర్భంగా తన పిల్లలతో కలిసి మహానాడు కార్యక్రమానికి హాజరైన ఆమె అటెండెన్స్ నమోదు చేయించుకుని పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా "మాకు బక్రీదు పండుగ ఎంత ముఖ్యమో, మహానాడు కూడా అంతే పండుగలా భావిస్తున్నాం" అంటూ ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం పార్టీ నాయకులు ఆమె ఇంటివద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్ మైనారిటీ మహిళకు పాదాభివందనం చేసి ఆమె ఆశీర్వాదం పొందడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, టిడిపి కుటుంబ సభ్యులు, మహిళలు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయండి




**రామ కుప్పం మే 29 జనసంఘర్షణ** ప్రతి నెల పంపిణీ చేసే వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని ఎంపీడీవో ఈశ్వరన్ పేర్కొన్నారు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశం నందు ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఫోటో తేదీన 100% పూర్తయ్యే విధంగా పింఛన్లు పంపిణీ చేయాలని పేర్కొన్నారు ముఖ్యంగా వివిధ రకాల పింఛన్లు అర్హులకు అందుతున్నాయా లేదా అని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు పింఛన్ల పంపిణీలో ఎటువంటి అలసత్వం వహించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గుర్రప్ప వైసిపి వెంకట్రామయ్య గౌడ్ కడ అడ్వైజరీ కమిటీ నెంబరు రఘు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ కామరాజు నాయక్ కుప్పం నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు తెలుగుదేశం పార్టీ బీసీ విభాగ కార్యదర్శి పట్టనారాయణ చారి మాజీ సర్పంచులు రాము మూర్తి శ్రీనివాసులు రెడ్డి యూనిట్ ఇంచార్జ్ ఎం చంద్రశేఖర్ రెడ్డి కుప్పం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం

**తొట్టం బేడు మే 29 (జనసంఘర్షణ) :**



శుభ్రమైన పల్లెలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం స్వచ్ఛ రథాలకు స్వీకారం చుట్టింది. ఎంపీడీవో సురేంద్రనాథ్ ఆదేశాల మేరకు తొట్టంబేడుమండలంలోని చిట్టత్తూరు గ్రామం నందు పర్యటించింది, పంచాయితీ సెక్రటరీ శాంతి, గ్రీన్ అంబాసిడర్ లు, నిరుపయోగం, వృధా వస్తువులను సేకరించి దానికి వారు ఇష్టపడిన వస్తువులను అందజేశారు.శాంతి మాట్లాడుతూస్వచ్ఛరథం వాహనం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు, లోహపు వస్తువులు తీసుకొని మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు అందజేస్తామని. నగదు వద్దంటే నిత్యావసర వసువులను అందిస్తామని. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. ఈ విధానం వల్ల గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలియజేశారు. గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో ఇదో ముందడుగుగా నిలుస్తుందని,స్వచ్ఛ రథాలు ఏర్పాటు చేసిన పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్య కూడా పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతుందని, ప్రత్యేకించి మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర ఘన వ్యర్థాలు పారబోసే విధానానికి పరిష్కారం లభించిందని తెలియజేశారు.

# కుప్పంలో రెండు రోజుల మహానాడు విజయవంతం

- విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు.
- రెండు రోజుల మహానాడులో 22 వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు.
- ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.
- స్క్రీన్ పై చంద్రబాబుకు హారతులు పట్టిన కుప్పం మహిళలు.

**కుప్పం,మే 29 (జనసంఘర్షణ):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సలహా మండలి పొలిటికల్ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ ల పిలుపుమేరకు కుప్పం నియోజకవర్గంలో రెండు రోజులపాటు హైబ్రిడ్ మహానాడు నిర్వహించడం జరిగిందన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా చేపట్టిన ఈ హైబ్రిడ్ మహానాడుకు కుప్పం నియోజకవర్గంలో విశేష స్పందన లభించిందన్నారు. కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా కుప్పం అర్బన్, కుప్పం రూరల్, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాలలో మొత్తం 12 క్లస్టర్ల పరిధిలో మహానాడు ను నిర్వహించడం జరిగిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు క్లస్టర్ల పరిధిలో స్క్రీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలోను తెలుగుదేశం పార్టీ యంత్రాంగం ప్రజలు అభిమానులు చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. రెండు రోజుల మహానాడులో నియోజకవర్గ వ్యాప్తంగా 22 వేల మంది పార్టీ యంత్రాంగం పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేసిందన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన పార్టీ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల పరిధిలో మహానాడు దిగ్విజయంగా, రంగ రంగ వైభవంగా కొనసాగిందన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షలకు పైబడి పార్టీ యంత్రాంగం పాల్గొని విజయవంతం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూతన ఆలోచనలకు హైబ్రిడ్ మహానాడు నిర్దర్శనమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రగతి బాట పట్టిందని పేర్కొన్నారు. చంద్రన్నకు హారతులు పట్టిన కుప్పం మహిళలు: కుప్పం నియోజకవర్గంలో రెండు రోజులపాటు కొనసాగిన హైబ్రిడ్ మహానాడులో ప్రత్యేకత చోటు చేసుకుంది. కుప్పంలో జరిగిన మహానాడు కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన స్క్రీన్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తున్నప్పుడు కుప్పం కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టారు. చంద్రన్నకు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




## రాష్ట్రంలో రంగ రంగ వైభవంగా తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు

- ప్రజా సేవకు మార్గదర్శకంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ల ప్రసంగం.
- మహానాడులో 24.5 లక్షల మంది అనుసంధానం.
- 1,875 క్లస్టర్లలో రంగ రంగ వైభవంగా హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం.
- మాజీ శాసనమండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు.

**కుప్పం,మే 29 (జనసంఘర్షణ):** రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో రంగ రంగ వైభవంగా రెండు రోజులపాటు తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు కార్యక్రమం కొనసాగిందని మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహానాడు వేదికపై నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ లు చేసిన ప్రసంగం నాయకుల ప్రజాసేవకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు అత్యంత ఘనంగా జరిగిన మహానాడు కార్యక్రమం ప్రశాంతంగా, క్రమశిక్షణగా కొనసాగిందన్నారు. స్త్రీ శక్తి, కార్య కర్తే అధినేత అనే నినాదాలు ప్రస్ఫుటించేలా మహానాడు జరిగిందన్నారు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం తెలుగుదేశం పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. మహానాడుకు హైబ్రిడ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు నేతలు హాజరయ్యారన్నారు.మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,875 డిజిటల్ క్లస్టర్ల ద్వారా సుమారు 24.5 లక్షల మంది కార్యకర్తలు, నాయకులు ఈ పండుగలో ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారన్నారు. భౌగోళిక సరిహద్దులను చెరిపివేస్తూ సాగిన ఈ ప్రయోగం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. సాధారణంగా ఒక బహిరంగ సభను భారీ స్థాయిలో నిర్వహిస్తే ట్రాన్స్పోర్ట్, భోజనాలు, ఇతర సౌకర్యాల కోసం కోట్ల రూపాయల ఖర్చు అవుతుందన్నారు. ముఖ్యంగా ఇంధన ధరల పెరుగుదల, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఒక మాస్టర్ స్ట్రోక్ ' అని చెప్పాలన్నారు. ఖర్చును గణనీయంగా తగ్గించడమే కాకుండా, కార్యకర్తలకు వారి సొంత నియోజకవర్గాల్లోనే పండుగ వాతావరణం కల్పించడంలో ఈ మోడల్ సక్సెస్ అయిందన్నారు. వినూతన ఆలోచనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లే నిదర్శనమని కొనియాడారు. రెండు రోజులపాటు మహానాడుని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





## శ్రీ ధర్మరాజుల స్వామి వారి ఉత్సవాలకు... తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి

**కెవిబిపురం మే 29 (జనసంఘర్షణ):** మండలం లోని శ్రీనివాసపురంలో జరుగుతున్న శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి ఉత్సవాలు సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ,సత్యవేడు సమన్వయ కర్త, రాజేష్ విచ్చేశారు, వారికి సదాశివపురం మాజీ సర్పంచ్ రామ్మోహన్ వర్మ ఘన స్వాగతం పలికారు.




## శక్తి క్షేత్రంబోయకొండ గంగమ్మ రాహుకాల అభిషేకానికి విశేష స్పందన



**చౌడేపల్లి మే 29 జనసంఘర్షణ** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రాహుకాల అభిషేకానికి విశేష స్పందన లభించింది ఉదయాన్నే బోయకొండ గంగమ్మకువివిధ రకాల జలాలతో అభిషేకించి అలంకరణ చేశారు. అనంతరం దంపతుల సమక్షంలో రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపరంగా నిర్వహించారు. రాహుకాల అభిషేకం చేయడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందన్న నమ్మకంతో నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలిపారు. అనంతరం పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది భక్తులకు మౌలిక వసతులు సమకూర్చారు.

## కిశోర వికాసం వేసవి శిబిరంలో... శాంతి దుర్గ



**తొట్టంబేడు మే 29 (జనసంఘర్షణ) :** మహిళాభివఅద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి శిబిరం కార్యక్రమం తొట్టంబేడు బీడీకాలనీ నందు శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామం నందు విద్యకు దూరమైన మహిళలకు విద్య యొక్క విలువ తెలిసే విధంగా అవగాహన కల్పించారు.. శాంతిదుర్గ చెప్పిన అవగాహన వల్ల అక్కడున్న గ్రామ మహిళలు ఇకపై తాము ఉన్నత విద్యలు చదువుకునే విధంగా కార్యాచరణ చేపడతామని ఐసిడి సిడిపిఓ శాంతి దుర్గకు హామీని ఇచ్చారు..ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ ... యుక్త వయసు బాలికలు ఈ వేసవి ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిషోర్ బాలికలు వేసవి ఎండల్లో బయట తిరగకుండా తమ సమయాన్ని వఅధా చేసుకోకుండా ఈ శిబిరాలలో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి చర్చా గోష్టులు, వివిధ సంస్కఅతిక కార్యక్రమాల్లో పాల్గనాలని కోరారు.బాలికల భద్రత, హక్కులు, అప్రమత్తతపై విలువైన సూచనలు అందించమని అలాగే సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజేశారు,బాలికలకు ఆరోగ్య, భద్రత అంశాలపై అవగాహన కల్పించారు.కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యతఅని,బాలికలు చిన్ననాటి నుంచే దృఢంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కిషోర్ బాలికలకు వ్యక్తిగత రుతు స్రావాపరిశుభ్రత లైంగిక వేధింపుల నుండి రక్షణ బాల్యవివాహాలను అరికట్టుట మానవ అక్రమ రవాణా ఆత్మరక్షణ నైపుణ్యం ఉపాధి లింగవివక్షత గురించి విషయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మారియమ్మ, అంగన్వాడి టీచర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్

**...తెలియని లింకులు, OTPలు ఎవరికీ చెప్పొద్దు.**

**...ఆన్లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**

**...సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలి.**



**నారాయణపేట, మే 29**

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆన్లైన్ బ్యాంకింగ్, UPI లావాదేవీలు, సోషల్ మీడియా, ఫేక్ కాల్స్, ఫేక్ లింకుల ద్వారా మోసాలు అధికమవుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, కస్టమర్ కేర్ ప్రతినిధుల పేరుతో ఫోన్ చేసి OTPలు, బ్యాంకు వివరాలు, ATM PIN నంబర్లు అడిగి డబ్బులు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి కాల్స్ వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే మీ KYC గడువు ముగిసింది, లాటరీ గెలిచారు, పార్సిల్ ఆగిపోయింది, జాబ్ ఆఫర్ వచ్చింది, ఉన్నత అధికారులు ఫోటోలు వాట్సప్ మెసేజ్ లు చేసి డబ్బులు పంపాలని అలాంటి సందేశాలు పంపి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. తెలియని లింకులు క్లిక్ చేయడం వల్ల మొబైల్ ఫోన్లలో హానికరమైన యాప్లు ఇన్స్టాల్ అయి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం అయ్యే అవకాశముందని చెప్పారు. సోషల్ మీడియా వేదికల్లో ఫేక్ అకౌంట్లు సృష్టించి ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేయడం, పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి మోసం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో అపరిచితులపై నమ్మకం ఉంచరాదని సూచించారు. ఆన్లైన్ షాపింగ్ సమయంలో అధికారిక వెబ్సైట్లు, నమ్మకమైన యాప్లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. ఫేక్ వెబ్సైట్లు, తక్కువ ధరల ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ హెల్ప్లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువత, వ్యాపారులు, మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. అప్రమత్తతే సైబర్ మోసాలకు ప్రధాన ఆయుధం అని జిల్లా ఎస్పీ తెలిపారు.

# చేనేత మగ్గాలను పరిశీలించిన కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక







**నారాయణపేట, మే 29**

నారాయణ పేట జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ వీధిలో గల చేనేత సహకార సంఘం (లిమిటెడ్ ) కార్యాలయంలో చేనేతే మగ్గాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఏ విధంగా మగ్గాలను నేస్తున్నారు ? వారికి రోజువారీ కూలీ ఎంత చెల్లిస్తున్నారని చేనేత జౌళి శాఖ అధికారి బాబును అడిగి తెలుసుకున్నారు. మగ్గం పై ఓ చేనేత కార్మికురాలు నేస్తున్న కాటన్ చీరను ఆమె పరిశీలించారు. చేనేత కార్మికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లాలో ఉన్నటువంటి మొత్తం సంఘాలకు,చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా ఏ ఏ పథకాలు అమలు జరుగుతున్నాయని ఏ డీ ని ప్రశ్నించగా నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా, క్లస్టర్ డెవలప్మెంట్ స్కీములు ,క్యాష్ క్రెడిట్, వ్యక్తిగత రుణాల మాఫీ చేనేత కార్మికులకు వర్తిస్తుందని ఏ డీ బాబు కలెక్టర్ కు వివరించారు. నేత కార్మికులు చేతితో నేసిన నారాయణపేట కాటన్ చీరను జిల్లా కలెక్టర్ కొనుగోలు చేశారు.

# మక్తల్ ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన పి . రాజు

**మక్తల్, మే 29**

మక్తల్ పోలీస్ స్టేషన్ SHO (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా ఎస్ఐ P. రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇతను ఇంతకుముందు దామరగిద్ద ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి మక్తల్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఇంతకు ముందు మక్తల్ ఎస్సైగా విధులు నిర్వహించిన భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి (VR ) బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై P. రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ని ఎస్పీ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు.




**ఎస్సై రాజు మాట్లాడుతూ...**

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాజు తెలిపారు.

# ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రైతు భరోసా ఎకరానికి 15000 ఇవ్వాలి

**టిఆర్ఎస్ పార్టీ నర్వ మండల నాయకులు బి ఆంజనేయులు**

**నర్వా మే 29**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన మేరకు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఎకరానికి 15000 ఇచ్చిన హామీ నెరవే ర్చాలని నర్వ మండల టిఆర్ఎస్ నాయకులు బి ఆంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు ఎన్నికల అప్పుడు ఎకరానికి 15000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినంక యాసంగి పంట కు రెండు ఎకరాలకు మాత్రమే12000 చెల్లించినారు ఇప్పుడు మళ్లీ రైతులు విత్తనాలు వేసుకునే సమయం వచ్చింది ఇంతవరకు రైతులకు రైతుబంధు చెల్లించకపోవడంసిగ్గుచేటు అని విమర్శించారు చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారమే ఎకరాకు 15000 ఇచ్చి 63 లక్షల మంది రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది అన్నారు అదేవిధంగా ఎన్నికల అప్పుడు ఇచ్చిన హామీ మేరకు అవ్వ తాతలకు పెన్షన్ 2000 నుంచి 4,000 వరకు ఇస్తామన్నది వికలాంగు లకు 4000 నుంచి 6000 కళ్యాణ లక్ష్మి లక్ష తో పాటు తో లా శీ ము బంగారం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు

# ఈనెల 31న హైదరాబాదులో జరిగే ఉద్యమకారుల ప్రతినిధి సభను జయప్రదం చేయండి జోగు అంజన్న

**వలిగొండ మే29**



ఈనెల 31న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సభకు ఉద్యమకారులు అందరు హాజరై జయప్రదం చేయా లని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉద్యమకారుల ఫోరం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు ఉద్యమకారులను గుర్తించేందుకు కేకే కంపెనీ వేయడం హర్షనీయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేకే కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం కేకే కమిటీ ముఖ్య నాయకులు ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులతో భేటీలో పాల్గొని ఉద్యమకారుల ఫోరం నాయకుల సలహాలు సూచనలు స్వీకరిస్తారు. కావున ఉద్యమకారులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, జిల్లా కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, కదిరేణి స్వామి,మల్లం వెంకటేశం,బొడిగే సుదర్శన్,ఐటి పాముల పుష్పమ్మ, ఎక్కల దేవి శ్రీనివాస్, కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
శనివారం
30 మే 2026

# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుంది

**- నేటి విద్యార్థులే రేపటి పౌరులు, శాస్త్రవేత్తలు,దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సృష్టికర్తలు**

**- రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య , క్రీడలు - యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

నారాయణపేట, మే 29

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందని, నేటి విద్యార్థులే రేపటి పౌరులు, శాస్త్రవేత్తలు,దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సృష్టికర్తలని విద్య అనేది ఒక దేశానికి పునాది తరగతి గదిలో పిల్లలకు అందించే నాణ్యమైన విద్య, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య , క్రీడలు - యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్ లో శుక్రవారం పీ ఆర్ టీ యూ టీ ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రధానోత్సవం, అలాగే వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల హెచ్ ఎం లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరైనారు.

**మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ....**

పీఆర్టియూ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా అవార్డుల కార్యక్రమం విద్యార్థులతో పోటీ తత్వాన్ని పెంచుతుందని, అవార్డు తీసుకోవాలని వారిలో కసి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లే ఉన్నత స్థాయికి ఎదిగారని, తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్ళలో కాకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి అని మంత్రి సూచించారు. ప్రభుత్వ బడులు సిరులు అని, ప్రభుత్వ ఉపాధ్యాయులు మనకు ఒక వరం అని మంత్రి అభివర్ణించారు. ప్రభుత్వ పాఠశాల విద్యాబోధన లో మన కష్టం , చెమట బీదరికం ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాల లో చదువుకున్న వాళ్ళకి భవిష్యత్తులో తాను చదువుకున్న బడికి, ఉన్న ఊరికి ఏదైనా చేయాలనే తపన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మన అందరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం వ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మన జిల్లా 19 వ స్థానం నుంచి 14 కి ఎగబాకిందని, భవిష్యత్తులో 1 వ స్థానానికి చేరుకోవాలని మంత్రి ఆకాక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు స్వయంగా తన నిధులు 25 లక్షలతో డిజిటలైజ్డ్ యానిమేషన్ కార్యక్రమాన్నీ మక్తల్ లో ప్రవేశ పెట్టినట్లు మంత్రి



తెలిపారు. ఇప్పుడు ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థుల ఫోటోలతో ఆయా ప్రభుత్వ పాఠశాలల బయట ఫ్లెక్సీలు పెడితే మిగతా విద్యార్థులకు స్పూర్తిగా ఉంటాయని, ఫ్లెక్సీలు తప్పక పెట్టాలని మంత్రి సూచన ప్రాయంగా తెలిపారు. విద్యారులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. మైదానంలో ఎన్నిసార్లు ఓడినా మళ్ళీ గెలవాలనే కసి ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు పదో తరగతి తర్వాత వచ్చే ఇంటర్ మీడియట్ చాలా కీలకం అని, పదో తరగతి తర్వాత తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటే 6 సంవత్సరాల్లో ఉన్నత స్థాయిలో ఉంటారని, ఇంటర్ మీడియట్ ఒక టర్నింగ్ పాయింట్ అని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులు ఒత్తిడిలో ఉండరాదని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందని, ఉపాధ్యాయుల కోరికలు న్యాయ బద్ధమైనవి, ప్రతి అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన తెలిపారు. మన జిల్లాకు చెందిన నాయకుడే సీఎంగా ఉన్నారని, విద్యా శాఖ కూడా ముఖ్యమంత్రి వద్దనే ఉందని, ఉపాధ్యాయులు ప్రస్తావించిన విద్యా శాఖ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్ రెడ్డి తో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తయితే లక్షా 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని, తద్వారా ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి, విద్యావ్యవస్త బాగు పడుతుందన్నారు.

**ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.**

అవార్డులు అందుకున్న విద్యార్థులు భవిష్యత్తు లోనూ ఇలాగే ఉత్తమ ప్రతిభ చాటాలని సూచించారు. మెరుగైన సమాజ నిర్మాణం బావి భారత పౌరులపై ఉందన్నారు. పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులు చదివారని, ఇప్పుడు మీకు నచ్చిన సబ్జెక్టు ఎంచుకుని కష్టపడి చదివి పుట్టిన ఉరికి, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం విద్యాశాఖ కు అన్ని రకాలుగా సహకారం అందిస్తోందని, విద్యా శాఖను తన వద్దే ఉంచుకుని విప్లవాత్మక మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. విద్యా శాఖ పట్ల సీఎం కు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుందన్నారు. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, పాఠశాలల్లో ఉదయం అల్పాహారం అమలు చేయబోతున్నారని ఎమ్మెల్సీ తెలిపారు. జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షా ఫలితాలతో పాటు ఎఫ్.ఎల్. ఎన్, ఎస్.ఈ.ఆర్.టి లో మన జిల్లా ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వారిలో ముగ్గురు అమ్మాయిలే అని, జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల కంటే ఎక్కువగా ఉండటం అభినందనీయం అన్నారు. బడి బాట కార్యక్రమం ద్వారా ఎన్ రోల్ మెంట్ పెంచి వచ్చే విద్యా సంవత్సరం ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేందుకు మనమంతా కృషి చేద్దాం అన్నారు. విద్యా శాఖ లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ప్రభుత్వం కల్పిస్తున్న కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతీ విద్యార్థిలో ఒక కళ ఉంటుందనీ, దానిని ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాలని, ఉపాధ్యాయులే మార్గ దర్శకులని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన విద్యతోనే సాధ్యం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డులను ప్రధానం చేశారు. పీ అర్ టీ యూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, పీఆర్ టి యూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి , ఏం ఈవోలు, సెక్టోరల్ అధికారులు విద్యా సాగర్, శ్రీనివాస్, నాగార్జున రెడ్డి, రాజేంద్ర కుమార్, హెచ్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక...

**- మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులే తమ చేరికకు కారణం అంటున్న నాగిరెడ్డిపల్లి బిజెపి ఉపసర్పంచ్**

మక్తల్, మే 29




నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ ఉపసర్పంచ్ మొగిలన్న శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో మొగిలన్నకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మొగిలన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతో, మంత్రి ఆకలి శ్రీహరి ఎంతో చురుకుగా పాల్గొంటూ అభివృద్ధి లక్ష్యంగా ముందడుగు వేస్తున్న దానికి ముగ్ధులై తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. తనతో పాటు పొట్ల కొండన్న, గడ్డమీది మహేందర్, డి. శ్రీనివాసులు, ఆర్. నవీన్, ఆర్. ప్రతాప్, ముత్త పరమేష్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

**మంత్రి శ్రీహరి మాట్లాడుతూ....**

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధిని ఇప్పుడు వేగవంతం చేస్తున్నామని తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన మంత్రి, ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ డి. కృష్ణారెడ్డి, నాగిరెడ్డిపల్లి గ్రామ

# అంబులెన్స్ ను ప్రారంభించిన కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



నారాయణపేట, మే 29

కోటక్ మహీంద్రా బ్యాంక్ సీ ఎస్ ఆర్ కార్యక్రమం కింద ఇచ్చిన కొత్త అంబులెన్స్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటక్ బ్యాంకు రీజినల్ హెడ్ శ్యామల ఘంటసాల, సర్కిల్ మేనేజర్ చందన్ ఫిలిప్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సత్య ప్రసాద్ , బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

# మక్తల్ నూతన ఎస్సై కి స్వాగతం పలుకుతూ ఇక్కడ పనిచేసిన ఎస్ఐకి వీడ్కోలు పలికిన నాయకులు

మక్తల్, మే 29

మక్తల్ ఎస్ఐగా ఎంతో బాధ్యత ఐదంగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రస్తుతం స్థానచలనంపై వెళ్లిన ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డికి వీడ్కోలు పలుకుతూ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి రాజుకు స్వాగతం పలికారు మక్తల్ పట్టణ వివిధ పార్టీల నాయకులు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డికి శాలువాలు కప్పుతో ఘనంగా వీడ్కోలు పలకగా నూతన ఎస్సైగా విచ్చేసినటువంటి పి రాజు ఎస్ఐకి స్వాగతం పలుకుతూ శాలువలతో ఘనంగా సన్మానించారు మక్తల్ వివిధ పార్టీల నాయకులు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసినట్లైతే మక్తల్ ప్రాంత ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారని నాయకులు తెలిపారు. ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డికి వీడ్కోలు పలుకుతూ నూతన ఎస్సై రాజుకు స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ల వెంకటేష్ కావలి శ్రీహరి

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co